# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 07-10-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ఆపరేషన్ సింధూర్ సమయంలో దేశ సాయుధ దళాలు ఉమ్మడి బలాన్ని ప్రపంచానికి చూపించాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- దేశంలోని పలు ఆర్థిక వ్యవస్థలు కృత్రిమ మేధను ఉపయోగించడం ద్వారా సేవలలో వేగం పెంచాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.
- దేశ రక్షణకు సంబంధించి ఆయుధ కొనుగోళ్లలో స్వావలంబనకు పెద్దపీట వేస్తున్నట్లు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు.
- ఆర్థిక వ్యవహారాలపై కేంద్ర క్యాబినెట్ కమిటీ 24 వేల 634 కోట్ల రూపాయల విలువైన నాలుగు రైల్వే ప్రాజెక్టులను ఈ రోజు ఆమోదించింది.

=====================

ఆపరేషన్ సిందూర్ సమయంలో దేశ సాయుధ దళాలు ఉమ్మడి బలాన్ని ప్రపంచానికి చూపించాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఈ రోజు 65వ జాతీయ రక్షణ కళాశాల అధ్యాపకులను, కోర్ సభ్యులను ఉద్దేశించి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తూ.. భారతదేశ సాయుధ దళాలు సాంకేతికంగా, విశేషంగా అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ దీనికి సరైన ఉదాహరణ అని అన్నారు. ఈ పోరాటంలో వ్యూహాత్మక ప్రణాళికతో సాగిన భారత సైన్యం ఉగ్రవాద మౌలిక సదుపాయాలను నిర్వీర్యం చేసిందని గుర్తు చేశారు.

=====================

గత 11 సంవత్సరాల కాలంలో దేశం గణనీయమైన అభివృద్ధిని సాధించిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా మహిళలు, యువత, రైతులకు సాధికారత కల్పిస్తూ రూపొందించిన అనేక కార్యక్రమాల కారణంగా 25 కోట్ల మందికి పైగా ప్రజలు పేదరికం నుండి బయటపడ్డారని అన్నారు. దేశానికి సేవ చేసే క్రమంలో 25వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణం చేసినప్పటి నుంచి ప్రధానమంత్రిగా ఈ రోజు వరకూ తన సుదీర్ఘమైన ప్రయాణాన్ని ఆయన గుర్తు

చేసుకున్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ద్వారా చేసిన పోస్టులో ప్రధానమంత్రి పలు విషయాలను వెల్లడించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశం అతి ముఖ్యమైన స్థానంలో ఉందని చెప్పారు. ఆరోగ్య సంరక్షణ, సామాజిక భద్రతా పథకాల విషయంలో దేశం ప్రగతిని సాధించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కీలక రంగాలలో విస్తృతమైన సంస్కరణలు చేపట్టిందని పేర్కొంటూ.. భారతదేశం అన్ని రంగాలలో ఆత్మనిర్భర్‌గా మారాలనేది ప్రజల భావనగా ఉందని నరేంద్ర మోదీ అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని పలు ఆర్థిక వ్యవస్థలు కృత్రిమ మేధ (ఏఐ)ను ఉపయోగించడం ద్వారా సేవలలో వేగం పెంచాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. బ్యాంకింగ్, ఫైనాన్స్, ఫిన్‌టెక్, ఆధార్, UPI, డిజిలాకర్ వ్యవస్థలలో కృత్రిమ మేధను ఉపయోగిస్తున్న తీరుని ఆమె వివరించారు. ముంబైలో జరుగుతున్న గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్టివల్‌లో కేంద్రమంత్రి ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన నగదు మొత్తాల్ని ఆయా లబ్దిదారులకు నేరుగా వాళ్ల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయడం వల్ల ప్రభుత్వానికి నాలుగు లక్షల 31 వేల కోట్ల రూపాయలు ఆదా అయిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విదేశీ కరెన్సీ సెటిల్‌మెంట్ సిస్టమ్ (GIFT)ను ఆమె ప్రారంభించారు. ఈ ఆధునిక వ్యవస్థ విదేశీ కరెన్సీ లావాదేవీలను తక్షణమే అందించే విధంగా పని చేస్తుందని నిర్మలా సీతారామన్ పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఆర్థిక వ్యవహారాలపై కేంద్ర క్యాబినెట్ కమిటీ 24 వేల 634 కోట్ల రూపాయల విలువైన నాలుగు రైల్వే ప్రాజెక్టులను ఈ రోజు ఆమోదించింది. వీటిలో భుసావల్ - వార్ధా 3వ 4వ లైన్, గోండియా - డోంగర్‌గఢ్ 4వ లైన్, వడోదర - రత్లాం 3వ 4వ లైన్, ఇటార్సి - భోపాల్ - బినా 4వ లైన్లు ఉన్నాయి. ఈ నాలుగు మల్టీట్రాకింగ్ ప్రాజెక్టుల కారణంగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్‌లోని 18 జిల్లాలకు ప్రయోజనం కలుగుతుంది. దీని వల్ల భారతీయ రైల్వేల ప్రస్తుత నెట్‌వర్క్ దాదాపు 894 కిలోమీటర్ల మేర పెరుగుతుంది. న్యూఢిల్లీలో జరిగిన క్యాబినెట్ సమావేశం తర్వాత రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ పాత్రికేయులతో మాట్లాడుతూ... ఈ ప్రాజెక్టుల ద్వారా 85 లక్షలకు పైగా జనాభా కలిగిన సుమారు మూడు వేల 633 గ్రామాలకు రైలు అనుసంధానం లభిస్తుందని అన్నారు. అదే విధంగా రైల్వే అభివృద్ధి సైతం సాధ్యపడుతుందని అశ్విని వైష్ణవ్ పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ భారతదేశ పర్యటనకు రేపు రానున్నారు. ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆయన భారత్ రావడం ఇదే మొదటిసారి. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి కీర్ స్టార్మర్ భారత్ పర్యటన దోహదపడుతుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఈ పర్యటన సందర్భంగా వాణిజ్యం, పెట్టుబడి, సాంకేతిక సహకారంతో సహా రెండు దేశాల మధ్య కీలక అంశాలపై చర్చలు జరగనున్నాయి. భారత్ - బ్రిటన్ దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో పాటు సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం గురించి కూడా ఇరు దేశాధినేతలు చర్చించనున్నారని అధికార వర్గాలు వెల్లడించాయి. అదే విధంగా ముంబైలోని జియో వరల్డ్ సెంటర్‌లో జరిగే 6వ ఎడిషన్ గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బ్రిటన్ ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్ పాల్గొని ప్రసంగించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ రక్షణకు సంబంధించి ఆయుధాల కొనుగోళ్లలో స్వావలంబనకు పెద్దపీట వేస్తున్నామని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో దేశీయ సంస్థల నుంచి 1.20 లక్షల కోట్ల రూపాయల విలువ చేసే ఆయుధాలు కొనుగోలు చేసినట్లు చెప్పారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన ఒక కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ... 2047 నాటికి వికసిత్ భారత్ గా మారాలనే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. ఈ నేపధ్యంలో రక్షణ రంగంలో స్వావలంబన సాధించడంతో పాటూ ప్రపంచ ఎగుమతిదారుగా భారత్ మారాలని నిర్ణయించామని చెప్పారు. అదే విధంగా ఆధునిక సాంకేతిక సంపత్తితో రక్షణ రంగాన్ని ముందుకు తీసుకుని వెళ్ళాలనే సంకల్పంతో ఉన్నామని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ కాశ్మీర్ లో వరదలతో ఇబ్బంది పడుతున్న రైతుల కోసం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (PM-KISAN) పథకం 21వ విడత నిధులను కేంద్ర వ్యవసాయ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ముందస్తుగా ఈ రోజు విడుదల చేశారు. న్యూఢిల్లీలోని కృషి భవన్ నుండి దృశ్య మాధ్యమం ద్వారా ఈ నిధులను  విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖా మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్, వ్యవసాయ కార్యదర్శి డాక్టర్ దేవేష్ చతుర్వేది తదితరులు హాజరయ్యారు. జమ్మూ  కాశ్మీర్ వ్యవసాయ మంత్రి జావేద్ అహ్మద్ దార్, ఇతర ప్రతినిధులు, అధికారులు రైతులు దృశ్య మాధ్యమం ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ విడత కింద, 171 కోట్ల రూపాయలు నేరుగా 85,418 మంది మహిళా రైతులు సహా 8.55 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ సి.పి.రాధాకృష్ణన్ రాజ్యసభలో వివిధ రాజకీయ పార్టీల సభ్యులతో పార్లమెంట్ హౌస్‌లో ఈరోజు సమావేశం నిర్వహించారు. గత నెలలో రాజ్యసభ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాధాకృష్ణన్ పార్టీ నాయకులతో నిర్వహించిన మొదటి సమావేశం ఇదే కావడం విశేషం. రాజ్యసభ సమావేశాలు సజావుగా సాగేలా అర్థవంతమైన చర్చను జరిపేలా చూసేందుకు వివిధ పార్టీల నాయకులతో ఈ సమావేశం ఏర్పాటు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 81,790 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై... చివరికి 136 పాయింట్ల లాభంతో 81,926 వద్ద ముగిసింది. నిఫ్టీ 30 పాయింట్ల లాభపడి 25,108 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 88 రూపాయల 78 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 65.34 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3,957 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =